బాల్కొండలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు

సాలూరలో ..

నవీపేట మండలం నాళేశ్వర్‌లో..

రెంజల్ మండలం నీలాలో..

డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలో..

చందూర్‌లో..

ఘనంగా హోలీ వేడుకలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 24 : జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కామదహనం నిర్వహించగా.. ఆదివారం రంగుల పండుగను జరుపుకొన్నారు. చిన్నాపెద్ద, ఆడా మగా తేడా లేకుండా అందరూ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సరదాగా గడిపారు. డీజే చప్పుళ్లు పెట్టుకొని డ్యాన్సులు చేశారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మరికొన్ని గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను జరుపుకోనున్నారు. జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదివారం ఒక ప్రకటనలో హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాలో..

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో..

చిక్కడ్‌పల్లిలో హోలీలో పాల్గొన్న యువకులు, చిన్నారులు

ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లిలో చిన్నారుల సందడి

సిరికొండ మండలం రావుట్లలో హోలీ వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

నందిపేట్‌లో ..

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రుద్రూర్, మార్చి 24 : మండల కేంద్రంలో తాళం వేసి ఉంచిన ఇంట్లో దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు.. ఇంటి యజమానితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇత్తడి బిందెలు, గంగాళంతోపాటు ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు కుటుంబీకులు తెలిపారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్, మార్చి 24 : నగరంలోని కస్బాగల్లీలో ఉన్న చరిత్ర గ్రంథాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఇతిహాస సంకలన సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌దాస్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పుస్తకాలు తమ వద్ద వృథాగా అనిపిస్తే గ్రంథాలయానికి బహుమతి ఇవ్వాలని కోరారు. ఇతిహాస సంకలన సమితి కార్యవర్గంలో సభ్యులుగా చేరాలనుకునేవారు 9440450245 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఘనపురం దేవేందర్

ఖిలీల్‌వాడి, మార్చి 24 : కవిత్వం ఖడ్గం లాంటిదని చెడును ఖండిస్తుందని, సాహిత్యం నాగలి లాంటిదని పచ్చదనాన్ని సృష్టించటానికి పాదులు వేస్తుందని.. అందుకే కవులు, రచయితలు ఉద్యమస్ఫూర్తితో పని చేయాలని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని బషీరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల వార్షిక సాహిత్య సభను ఆదివారం నిర్వహించారు. సమాజంలో చైతన్య రాహిత్యం ముందు తరాలకు మంచిది కాదని, ప్రజా చైతన్యానికి సాహితీవేత్తలు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆర్మూర్‌టౌన్, మార్చి24: పట్టణంలోని సంతోష్‌నగర్‌లో శనివారం లాస్యను హత్య చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు, గోసంగి సంఘ సభ్యులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఎస్‌హెచ్‌వో రవి కుమార్ వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం రాజేశ్, సంఘ నాయకులు, మృతురాలి బంధువులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

మాక్లూర్, మార్చి24: మండలంలోని మానిక్‌బండార్ గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన సాయికుమార్(25) ఆదివారం మధ్యాహ్నం కల్లడి గ్రామ శివారులో మధ్యాహ్నం బైక్‌పై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మహాలక్ష్మినగర్ కాలనీకి చెందిన సాయికుమార్ బైక్‌పై నిజామాబాద్ వైపు వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు కిందపడిగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

ఖిలీల్‌వాడి, మార్చి 24 : నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను ప్రకటించడం సంతోషంగా ఉందని, బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ నాయకుడు సిర్ప రాజు, ఇందల్వాయి ఎంపీపీ రమేశ్ నాయక్, రూరల్ జడ్పీటీసీ బొల్లెంక సుమలత అన్నారు. బాజిరెడ్డికి ఎంపీ టికెట్ ప్రకటించడంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాజిరెడ్డిపై అసత్యఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. జిల్లాలో గోవన్న అంటే బ్రాండ్ అంబాసిడర్ అని, అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజలు గోవన్నకు సమస్యలు విన్నవించిన వెంటనే పరిష్కారానికి కృషిచేస్తారని అన్నారు. బాజిరెడ్డి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు దీటైన నాయకుడు అని నమ్మి టికెట్ కేటాయించడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు గోవన్న అభిమానుల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు. ఐడీసీఎంఎస్, ఏఎంసీ చైర్మన్‌గా కులాచారి దినేశ్ కుటుంబానికి పదవులు ఇప్పించిన ఘనత గోవన్నదేనన్నారు. సమావేశంలో రూరల్ అధ్యక్షుడు మధుకర్ రావు, నాయకులు నరేశ్ నాయక్, ధర్పల్లి హన్మంత్‌రెడ్డి, ప్రేమ్‌దాస్‌నాయక్, కుంచాల రాజు, అన్నం సాయిలు, చింత మహేశ్, ఆకుల తిరుమల్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మట్టి స్నానం

రుద్రూర్, మార్చి 24 : మండలకేంద్రంలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మట్టి స్నానం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రుద్రూర్ చెరువుకట్టపై ఉన్న పల్లె ప్రకృతివనం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. రుద్రూర్ మండలంతోపాటు వివిధ యోగా కేంద్రాల నుంచి 74 మంది యోగా సాధకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ మహాజన్ మాట్లాడుతూ..మట్టి స్నానం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, కేవీ మోహన్, పురుషోత్తం, మంచాల శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, శ్రీను, హన్మాండ్లు, నవీన్‌గౌడ్, ప్రకాశ్, సాయిలు, శ్రీను, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

రుద్రూర్‌లో మడ్‌బాత్‌లో పాల్గొన్న యోగా సాధకులు

అలీసాగర్ బోటింగ్ పాయింట్ వద్ద మట్టి స్నానాలు ఆచరిస్తున్న యోగా సభ్యులు

అలీసాగర్ బోటింగ్ పాయింట్ వద్ద ..

ఎడపల్లి, మార్చి24: ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామంలోని అలీసాగర్ బోటింగ్ పాయింట్ వద్ద నిజామాబాద్ పతంజలి యోగా గురువు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం మడ్‌బాత్ (మట్టి స్నానం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

టీయూను సందర్శించిన ఇన్‌చార్జి వీసీ

టీయూలో పర్యటిస్తున్న హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం

డిచ్‌పల్లి, మార్చి 24 : టీయూని హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం ఆదివారం సందర్శించారు. ఆయనకు రిజిస్ట్రార్ యాదగిరి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. టీయూలో పర్యటించి భవనాలు, సౌకర్యాలను పరిశీలించారు. వివరాలను రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీయూలో పనిచేస్తున్న 276 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. టీయూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుర్ర వెంకటేశాన్ని ఘనంగా సన్మానించారు. టీయూ సమస్యలు పరిష్కరించాలని, అంబేద్కర్ విగ్రహం, బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని, లైబ్రరీలో కాంపిటేటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు కొమిరె శ్రీశైలం, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, బానోత్ సాగర్‌నాయక్ కోరారు.

నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

వినాయక్‌నగర్, మార్చి 24 : జిల్లాకేంద్రంలో ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచనల మేరకు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ పర్యవేక్షణలో కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డులో తనిఖీలు చేపట్టారు. సీట్‌బెల్ట్ ధరించకుండా కారు నడుపుతున్న ఇద్దరితో పాటు హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న 12 మందికి పోలీసులు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టుకు ప్రథమస్థానం

ట్రోఫీని అందుకుంటున్న జిల్లా బాలుర జట్టు

కంఠేశ్వర్, మార్చి 24 : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించిన 8వ రాష్ట్ర సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచించి మెడక్ జట్టుపై 4-0 తేడాతో గెలిచినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మార్కంటి గంగామోహన్ తెలిపారు. జట్టుకు సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవీన్ కుమార్ బంగారు పతకాలు, ట్రోఫీని అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో బోధన్ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన బానోత్ చందు బెస్ట్ పిక్చర్‌గా ప్రత్యేక బహుమతిని అందుకున్నట్లు చెప్పారు. జట్టుకు కోచ్ మేనేజర్లుగా మార్కంటి గంగామోహన్, ఇట్యాల నరేశ్, తేజావత్ గంగాధర్ వ్యవహరించినట్లు తెలిపారు.

టీఎస్ ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఎడపల్లి మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉండి నాగేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించటంపై హర్షం వ్యక్తంచేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. – ఎడపల్లి, మార్చి 24

సంక్షిప్తంగా..

● **ఘనంగా మట్టల ఆదివారం-** డిచ్‌పల్లి, మార్చి 24 : మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో ఉన్న సీఎస్ఐ వెస్లీ చర్చిలో సంఘ కాపరి రెవ. దినాకర్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా ఈత మట్టలను పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు తన చివరి యెరుషలేము ప్రయాణాన్ని మట్టలాదివారముగా ఆచరిస్తారని రెవరెండ్ వివరించారు.

● **ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి -** ధర్పల్లి, మార్చి 24 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని దుబ్బాక రైతునాయకుడు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోతి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంట చేతికి రావడానికి ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారని, ప్రస్తుతం పంట కోతలు ప్రారంభమైనప్పటికీ కొనుగోలు కేంద్రాల ఊసే లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమావేశంలో రైతు నాయకులు సంతోష్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● **టీయూ లైబ్రేరియన్‌కు డాక్టరేట్ -** డిచ్‌పల్లి, మార్చి 24 : టీయూ లైబ్రేరియన్ డి.సత్యనారాయణకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రిటైర్డ్ లైబ్రెరియన్ డాక్టర్ దామోదర్ పర్యవేక్షణలో 'వెబ్ సైటేషన్ ట్రెండ్స్ ఇన్ ఓపెన్ ఆక్సెస్ జర్నల్స్ ఆఫ్ ఇంజినీరింగ్ డిసిప్లిన్' అంశంపై పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ డిపార్ట్‌మెంట్ రీసెర్చ్ కమిటీ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పట్టాను ఆదివారం ప్రదానం చేశారు. ఆయనను టీయూ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరితో పాటు యూనివర్సిటీ అధ్యాపకులు, అధ్యాపకేతరులు అభినందించారు.

● **విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ-** మాక్లూర్,మార్చి24: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు ఆదివారం చైతన్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్, ఫౌండర్ కోయేడి నర్సింహులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్ సహకారంతో వీటిని అందజేశామని అన్నారు. ప్రత్యేకాధికారిణి ప్రగతి, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

'భీమ్‌గల్ ఎస్సైపై కఠిన చర్యలు తీసుకోవాలి'

భీమ్‌గల్,మార్చి 24: మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పర్స నవీన్‌పై ఈనెల 18న జరిగిన దాడిని బీఆర్ఎస్ మండల నాయకులు, మున్సిపల్ పాలకవర్గం సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఎస్సై హరిబాబు తీరును ఖండిస్తూ పట్టణంలో ఆదివారం విలేరులతో మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య మాట్లాడుతూ ఓ కేసు విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పర్స నవీన్‌పై దాడి చేయడం చేయడం శోచనీయమన్నారు. తన ఎదురుగానే ఎస్సై హరిబాబు దురుసుగా మాట్లాడుతూ కాలర్‌పట్టుకొని తోసి, రూమ్‌లో అకారణంగా సుమారు మూడు గంటల పాటు కూర్చోబెట్టడం సరికాదన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన నాయకుడు కేసు వివరాలు తెలపాలని అడిగినందుకు ఎస్సై దురుసుగా ప్రవర్తించి దళితులపై ఆయనకు ఉన్న అక్కసును వెళ్లగక్కాడని మండిపడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్ మాట్లాడుతూ తోటి సభ్యుడిపై జరిగిన దాడిని మున్సిపల్ పాలకవర్గం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎస్సైపై ఖతిన చర్యలు తీసుకొని విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. దాడి జరిగి ఆరు రోజులు గడుస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. త్వరలో మానవహక్కుల సంఘం, ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శర్మానాయక్, తుక్కాజి, మున్సిపల్ కౌన్సిలర్లు నర్సయ్య, లింబాద్రి, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బోధన్ పట్టణంలోని ఏకచక్రనగర్‌లో ..

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

శక్కర్‌నగర్/రెంజల్, మార్చి 24: హోలీ పండుగ సందర్భంగా బోధన్ పట్టణంలోని శ్రీ ఏకచక్రనగర్‌లో ఆదివారం కుస్తీపోటీలు నిర్వహించారు. పట్టణ అభివృద్ధి కమిటీ సహకారంతో.. రెడ్డికా సంఘం ఆధ్వర్యంలో ఈ కుస్తీ పోటీలను నిర్వహించారు. ఏటా కుస్తీ పోటీలను నిర్వహిస్తారు. విజేతకు ఐదు తులాల వెండి కడియం బహుమతిగా అందచేశారు. రెంజల్ మండలంలోని దూపల్లి, రెంజల్, సాటాపూర్ గ్రామాల్లో వీడీసీల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. దూపల్లిలో వీడీసీ అధ్యక్షుడు లింగన్న యాదవ్, రెంజల్‌లో మాజీ సర్పంచ్ రమేశ్‌కుమార్ తదితరులు విజేతలకు నగదు, వెండి కడియం అందజేశారు. రెంజల్ ఎస్సై సాయన్న సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రెంజల్ మండలం దూపల్లిలో..

రూ.రెండు లక్షల విలువైన మద్యం పట్టివేత

భీమ్‌గల్, మార్చి 24: హోలీ సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేయాలని ఉన్నతాధికారులు ముందుగా ప్రకటించారు. ఈ మేరకు పోలీసులు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి నిఘా ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటించకుండా బడాబీమ్‌గల్‌లో మద్యం విక్రయిస్తున్న షాపుపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేశారు. సుమారు రూ.రెండు లక్షల విలువగల మద్యం స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్నేహితుడి బర్త్‌డే వేడుకలకు వెళ్లి అనంతలోకాలకు..

- బావిలో ఈతకు వెళ్లి ధర్మోరా యువకుడి మృతి
- జగిత్యాల జిల్లా చిట్టాపూర్‌లో ఘటన

శివకుమార్ (ఫైల్)

మాక్లూర్/మల్లాపూర్,మార్చి24: మాక్లూర్ మండం ధర్మోరాలో హోలీ పండుగ పూట విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన సాయనోళ్ల శివకుమార్(19) జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన తన స్నేహితుడు అల్లాడి నవనీత్ జన్మదినం సందర్భంగా వారి ఇంటికి శుక్రవారం వెళ్లాడు. స్నేహితులతో కలిసి శివకుమార్ శనివారం చిట్టాపూర్ గ్రామ శివారులోని ఓ చెరువు సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత కొడుతుండగా శివకుమార్ నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బావి వద్దకు చేరుకొని శివకుమార్ మృతదేహం కోసం బావిలో వెతికారు. అనంతరం ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. శివకుమార్ మృతదేహాన్ని అక్కడి నుంచి తరలిస్తుండగా మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని అడ్డుకున్నారు. కొద్దిసేపు పోలీసులు, కుటుంబసభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఏమైనా అనుమానాలుంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో మృతుడి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి సాయనోళ్ల భూమేశ్ ఉపాధి కోసం బహ్రెయిన్ దేశం వెళ్లాడు. గ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. అందరితో కలుపుగోలుగా ఉండే యువకుడి మృతితో గ్రామంలో బంధువుల రోదనలు మిన్నంటాయి.

పండరీపూర్‌కు చేరిన పాదయాత్ర

నందిపేట్, మార్చి 24: కేదాశ్వర ఆశ్రమం (పలుగుట్ట) ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ చేపట్టిన పాదయాత్ర మహారాష్ట్రలోని పండరీపూర్ తీర్థక్షేత్రానికి ఆదివారం చేరుకుంది. 14 రోజుల క్రితం ఆశ్రమం నుంచి వందలాది మంది భక్తులతో కలిసి ఆయన పాదయాత్ర ప్రారంభించారు. దైవనామ స్మరణ చేస్తూ భక్తి పాటలు పాడుతూ పాదయాత్ర చేసుకుంటూ 14 రోజులకు పండరిపూర్‌కు భక్తబృందంతో కలిసి చేరుకున్నారు. అక్కడ పండరీపూర్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహరాజ్ నందిపేట్ ఆశ్రమానికి తిరిగి రానున్నారు.

క్షత్రియులకు గుడాల పంపిణీ

ఆర్మూర్‌టౌన్,మార్చి24: ఆర్మూర్ పట్టణంలోని చిన్నబజార్‌లో ఉన్న క్షత్రియ సమాజ్ లక్ష్మీ నారాయణ మందిరంలో క్షత్రియులకు హోలీ పండుగ సందర్భంగా ఆదివారం గుడాలను పంపిణీ చేశామని క్షత్రియ సమాజ్ పట్టణ అధ్యక్షుడు మధన్‌మోహన్, కార్యదర్శి బారడ్ గంగామోహన్ తెలిపారు. వారు మాట్లాడుతూ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఏటా క్షత్రియులకు గుడాల పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణం శక్కర్‌నగర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవరెండ్ ఎం.ప్రభాకర్ మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. కొబ్బరి మట్టలను పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. – బోధన్, మార్చి 24

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

మెమో పోయినది

★సి.హెచ్.అశ్విన్‌రెడ్డి తండ్రి సి.హెచ్.బుచ్చిరెడ్డి, ఇ.నెం.1-102/1, గ్రా॥ అక్కాపూర్, మం॥ మాచారెడ్డి, జి॥కామారెడ్డి నా యొక్క ఒరిజినల్ 10వ తరగతి మెమో తేది:10-03-2024న అక్కాపూర్ నుండి మాచారెడ్డి 'X' రోడ్ బైక్ పై వెళ్ళేటప్పుడు పోయినది. దొరికినవారు సంప్రదించగలరు. సెల్: 8341231425

NTZ-324671

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.